సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం : 2 : మార్చి : 2023



పాటల పోటీల్లో ప్రతిభ

సిరిసిల్లకల్చరల్: కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తుమ్మనపల్లి విశ్వతేజ పాటల పోటీల్లో ప్రతిభ చాటింది.



పవిత్రోత్సవాలు ప్రారంభం

కొండగట్టు(చొప్పదండి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

గరిష్టం/కనిష్టం
34.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

మూడు నెలలుగా తిప్పలే !

- అందని పారిశుధ్య కార్మికుల వేతనాలు
- ఎస్టీవోల నుంచి వెనక్కి వస్తున్న చెక్కులు
- ఆందోళనలో 1,200 మంది పారిశుధ్య కార్మికులు
- అప్పులపాలవుతున్న వైనం



విధుల్లో పారిశుధ్య కార్మికులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కరుణాకర్. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కరుణాకర్‌కు నెలకు రూ.8వేల వేతనం అందుతుంది. అయితే ఈ వేతనం గత మూడు నెలలుగా రాలేదు. సంక్రాంతి పండుగ సమయంలో కూడా జీతం రాకపోవడంతో పండుగ ఎట్లా చేసుకోవాలో తెలియక ఆందోళన పడ్డాడు. తెలిసినోళ్ల దగ్గర అప్పు తెచ్చి పండుగ చేసుకున్నాడు. ఇప్పుడు ప్రతీ నెల కుటుంబాన్ని ఎలా సాకాలో తెలియక ఇబ్బంది పడుతున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ నల్ల మల్లవ్వ.ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. ప్రతీ నెల జీతం రాక ఇంట్లో వంట సామగ్రి లేక కుటుంబ సభ్యులకు వంట ఎలా చేసి పెట్టాలో తెలియక ఆందోళన చెందుతుంది. మహిళా సంఘంలో పొదుపు పైసలు కూడా కట్టడం లేదు.

ముస్తాబాద్(సిరిసిల్ల): ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధాన్ని సైతం తొలగించి ఆ పరిసరాలను పరిశుభ్రం చేస్తుంటారు. నిత్యం ఉదయం అందరికంటే ముందు నిద్రలేచి చీపురు, తట్టాలతో వణికించే చలిలో విధుల్లో చేరుతున్న వారు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఎంత సేపు పరిసరాల పరిశుభ్రతపైనే దృష్టి పెట్టే అధికారులు వారి వేతనాల గురించి పట్టించుకోవడం లేదు. జిల్లాలోని 13 మండలాల్లో 1,200 మంది పారిశుధ్య కార్మికులు మల్టీపర్పస్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు.

జిల్లాలో 1200 మంది కార్మికులు

జిల్లాలోని 1,200 పారిశుధ్య కార్మికులు డిసెంబర్, జనవరి, ప్రస్తుత ఫిబ్రవరి నెలలకు సంబంధించిన జీతాలు రాక దుర్భర జీవితాలు గడుపుతున్నారు. తమ కుటుంబాల్లో ఎవరైన అనారోగ్యానికి గురైతే వారికి వైద్యం అందించే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీల నుంచి కార్మికుల వేతనాల కోసం అధికారులు ఎస్టీవోలకు పంపించే చెక్కులకు మోక్షం లభించడం లేదు. పంచాయతీలు వసూలు చేసిన మొత్తాన్ని ఎస్టీవోల్లో జమచేస్తున్న కనీసం కార్మికుల వేతనాలు విడుదల కావడం లేదు. ఎస్టీవోల్లో జమయ్యే మొత్తాలు రాష్ట్ర ఖాజానాకే వెళ్తుంటాయి. తిరిగి అక్కడి నుంచి చెక్కుల మొత్తానికి నిధులు సరిపడ ఉండాలి. ఒక నెల ఒక మండలానికి.. మరో నెల ఇంకో మండలానికి జీతాలు విడుదల చేస్తున్నారు.

జిల్లాలో మండలాల వారీగా కార్మికులు

ముస్తాబాద్ 164	కోనరావుపేట 115
ఎల్లారెడ్డిపేట 125	వేములవాడఅర్బన్ 85
గంభీరావుపేట 135	వేములవాడరూరల్ 95
వీర్నపల్లి 36	తంగళ్లపల్లి 146
చందుర్తి 94	రుద్రంగి 34
బోయినపల్లి 110	చందుర్తి 60



కనికరం చూపండి



మబ్బులనే లేచి పనిలోకి వస్తం. మోరీలు తీస్తం. ఊరంత ఊడుస్తం. కానీ మా కాలే కడుపులను ఎవరూ చూడడం లేదు. మూడు నెలలుగా జీతాలు లేవు. దుకాణాలలో ఉద్దెర ఇత్తలేరు. సార్లే కనికరం చూపాలే.

– జిల్లి లక్ష్మణ్, కార్మికుల సంఘం అధ్యక్షుడు

దవాఖానాకు పోదామంటే పైసలు లేవు



ఇంట్ల పిల్లలకు బాగాలేదు. దవాఖాన్లకు పోదామంటే పైసలు లేవు. ఊరు కోసం ఎంతో చాకిరీ చేత్తున్నం. మమ్మల్ని ఎవరూ పట్టించుకుంట లేరు. పప్పు, ఉప్పులకు కూడా అప్పు తెచ్చుకుంటున్నం.

– క్యారం బాల్‌రాజవ్వ, నామాపూర్

కార్మికులు సంఘటితం కావాలి



పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. చిన్న పంచాయతీ, మేజర్ పంచాయతీలలో వేతనాలు ఆలస్యంగా వేస్తున్నారు. కార్మికులంతా సంఘటితమై జీతాలు అడగాలి.

– అన్నల్‌దాస్ గణేశ్, సీఐటీయూ నాయకుడు

న్యూస్‌రీల్

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో వినోద్‌కుమార్, రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లోని శ్రీరామ ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు, రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు, సర్పంచ్ జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణదాతకు సన్మానం

రామాలయం నిర్మాణదాత జోగినిపల్లి అజిత్‌ను ఆలయ పీఠాధ్యో ఉపాధ్యాయుల చంద్రశేఖర్ సన్మానించారు. రాజన్న ప్రసాదం అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి

ఇల్లంతకుంట(మానకొండూర్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. మండలంలోని దాచారం జెడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. లక్ష్మీరాజం మాట్లాడుతూ స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న హింస, వేధింపుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ రోజా, కౌన్సిలర్ కళావతి ఉన్నారు.

విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు



పనులు ప్రారంభిస్తున్న శంకరయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలోని గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా వెలుగొందుతున్నాయని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంటలో గ్రంథాలయ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ భూమయ్య, అనిల్, ఎల్లం, తిరుపతి పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీరాములు బుధవారం తనిఖీ చేశారు. పిల్లల ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్స్‌ను పరిశీలించారు. ల్యాబ్‌లలో టెక్నీషియన్స్ అర్హతలను గుర్తించారు. వైద్యసిబ్బంది బాలయ్య, జలపతి ఉన్నారు.

మరుగుదొడ్లు మూసివేత..



వేములవాడ : వేములవాడలో మహాశివ రాత్రి జాతర సందర్భంగా రూ.3.70 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఆలయ అధికారులు మూసివేశారు. నిత్యం రాజన్న ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంటుంది. మరుగుదొడ్లు మూసివేసి ఉంచడంతో భక్తులు గుడిచెరువులోని స్థలంలో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతోంది. కేవలం జాతర సమయంలోనే లక్షలాది రూపాయలు వెచ్చించి అధికారులు చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

4, 5 తేదీల్లో రేవంత్‌రెడ్డి పాదయాత్ర

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల 4, 5 తేదీల్లో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ బుధవారం వివరించారు. ఈనెల 3న సిరిసిల్ల చేరుకుని ఆవునూర్ లేదా వెంకటాపూర్‌లో బస చేస్తారని తెలిపారు. 4వ తేదీ ఉదయం ఆవునూర్ నుంచి వెంకటాపూర్, ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కార్మికుల కుటుంబాల పరామర్శ, అప్పర్ మానేర్ డ్యామ్, సిరిసిల్లకు చేరుకుంటారు. 4వ తేదీ రాత్రి ముంపు గ్రామాలు రుద్రవరం– సంకెపల్లిలో బస చేస్తారు. 5వ తేదీ ఉదయం రాజన్న దర్శనం, కలికోట సూరమ్మ చెరువు, మోత్కురావుపేటలో రోడ్లను పరిశీలిస్తారని వివరించారు.

'దివ్యాంగుల'కు 18 యూనిట్లు

- దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: దివ్యాంగుల పునరావాస పథకంలో భాగంగా జిల్లాకు 18 యూనిట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.11.5 లక్షల విలువైన ఈ యూనిట్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28వ తేదీ వరకే ఉన్న గడువును ఈనెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. జిల్లా వాసులై కనీసం 40 శాతం సదరం సర్టిఫికెట్ ఉండాలని, 21 నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. వార్షికాదాయం రూ.2లక్షలకు మించి ఉండరాదని తెలిపారు. http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు కలెక్టరేట్‌లో 33వ నంబర్ ఆఫీస్‌లో సంప్రదించాలని సూచించారు.

15, 23 తేదీల్లో సదరం శిబిరాలు

సిరిసిల్ల: సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రిలో ఈనెల 15, 23 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు మురళీధర్ రావు బుధవారం తెలిపారు. 15న కంటి చూపు, వినికిడి, 23న ఆర్థోపెడిక్(ఎముకల) సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకుని హాజరుకావాలని సూచించారు.

ల్యాండ్, సాండ్.. వైన్స్, మైన్స్‌లే.. బీఆర్ఎస్‌కు ఆదాయ మార్గాలు

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుకక్వారీలు
- బినామీ పేర్లతో వందల కోట్ల వ్యాపారం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



హాత్‌సే హాత్ జోడో యాత్రలో అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి



బిజిగిరిషరీఫ్ దర్గాలో పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

ఇల్లందకుంట: బీఆర్ఎస్ ముఖ్య నాయకులైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాఫియాలా ఏర్పడి స్యాండ్, ల్యాండ్, మైన్స్, వైన్స్‌లను ఆదాయ వనరులుగా మార్చుకొని వందల కోట్లు కొల్లగొడుతున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల మానేరు ఇసుక క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానేరు వాగు ఇసుక దందాను పరిశీలించడానికి మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమణారావు, బల్మూరి వెంకట్‌లతో కలిసి వచ్చారు. ఇసుక దోపిడీని బాహ్య ప్రపంచానికి తెలియపర్చడానికి నిజనిర్ధారణ కమిటీ ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇసుక మాఫియాతో కేసీఆర్ కుటుంబానికి భాగస్వామ్యం ఉంది కాబట్టే.. యథేచ్ఛగా తరలిస్తున్నారని విమర్శించారు. ఈ మాఫియాకు కేసీఆర్ కుటుంబానికి చెందిన జోగినపల్లి సంతోష్, తన తండ్రి రవీందర్‌రావుకు భాగస్వామ్యం ఉందన్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనలకు విరుద్ధంగా.. పర్యావరణానికి హాని కలిగించేలా.. భవిష్యత్ తరాలకు ఇసుక కనుమరుగయ్యేలా తోడేళ్లలా తోడేస్తున్నారని పేర్కొన్నారు. ఈ మాఫియాను అడ్డుకునేవారు లేకపోవడంతో వీరి వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతోందని అన్నారు. బినామీ పేర్లతో వందల కోట్ల వ్యాపారం చేస్తూ వేల కోట్ల రూపాయలు, ఆస్తులు పెంచుకుంటుంటే ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని చెప్పడం రామారావుకే చెల్లిందన్నారు.

ఇసుక మాఫియాను అడ్డుకుంటే కేసులా..?

ఇసుక మాఫియాను అడ్డుకుంటే సిరిసిల్లలో పట్టిన గతే పడుతుందని రైతులు, యువకులను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, గతంలో తనుగులకు చెందిన ఒకరిద్దరు రైతులపై పోలీసులు చిత్రహింసలకు పాల్పడి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. మాఫియాకు పోలీసులు ప్రైవేట్ సైన్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఇసుకమాఫియా వల్లనే కాళేశ్వరం కొట్టుకుపోయిందన్నారు. పర్మిషన్ పేరిట ఒకే నంబర్‌తో పలు వాహనాల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు.

సంజయ్, ఈటల ఎటు పోయారు..

ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన హుజూరాబాద్ స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సొంత ఇలాకాలో ఇసుక దోపిడీ జరుగుతుంటే ఎక్కడికి పోయాడని రేవంత్ ప్రశ్నించారు. ఇక్కడకు రాక ముందు ఈటలపై ఎంతో గౌరవం ఉండేదని.. పరిస్థితి చూశాక ఉన్న గౌరవం పోయిందని అన్నారు. మానేరు వాగు నుండి నిత్యం రాత్రి పగలు పర్మిషన్ ఉన్నదానికంటే ఎక్కువగా వందల లారీలను వరంగల్, హన్మకొండ, హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తుంటే ఎంపి సంజయ్, ఈటల మౌనంగా ఉండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వాహనాల ఓవర్‌లోడ్‌తో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతుంటే ఎందుకు ఫిర్యాదు చేయడంలేదని మండిపడ్డారు. తనుగుల నుండి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న జమ్మికుంటకు ప్రయాణం చేయాలంటే రెండు గంటల సమయం పడుతోందన్నారు. అధికారుల పర్యవేక్షణలో ఇసుకను తీయాలని.. యంత్రాలతో కాకుండా కూలీలతో తీయాలని.. కానీ అలా జరగడంలేదని అన్నారు. అధికారులను అడుగుదామంటే ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఎంపీగా, పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న తనకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు ఎక్కడ అని ప్రశ్నించారు.

కేసీఆర్ కుర్చీ కదులుతుందనే దాడులు..

కాంగ్రెస్ పార్టీకి పాదయాత్ర కొత్త కాదని.. పాదయాత్ర వల్ల కేసీఆర్ కుర్చీ కదులుతుందనే కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ పార్టీ దాడులు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎలాంటి దాడులకు తాము భయపడేదిలేదని, భవిష్యత్‌లో కూడా పాదయాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. అక్రమ క్వారీలను మూయించే కాంగ్రెస్ పక్షాన పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. అంతకుముందు అపర భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే బిజిగిరిషరీఫ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వావిలాలలోని ఖాదీని సందర్శించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మక్కాన్ సింగ్, నాయిని రాజేందర్‌రెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, ఇంగిలి రామారావు, పూదరి రేణుకశివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హుజూరాబాద్‌లోని సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

సీఎం కేసీఆర్ చిత్రపటం దహనం



తంగళ్లపల్లిలో అడ్డుకుంటున్న పోలీసులు

తంగళ్లపల్లి/గంభీరావుపేట(సిరిసిల్ల): భూపాలపల్లి జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై దాడికి నిరసనగా బుధవారం తంగళ్లపల్లిలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిత్రపటాల దహనానికి కాంగ్రెస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ (టోని), నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చుక్క శేఖర్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మునిగల రాజు, జిల్లా నాయకులు కొత్త రవి గౌడ్, మండల రైతు అధ్యక్షుడు పరుశురాములు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

గంభీరావుపేటలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు హమీద్, పట్టణాధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిస్వామి, భాస్కర్, ప్రభాకర్, నాగయ్య పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో దళితబంధు పెండింగ్ యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమీక్షించారు. దళితబంధు యూనిట్లకు సంబంధించి యూసీలను సమర్పించాలన్నారు. పాడిగేదెల డెయిరీ యూనిట్లకు సంబంధించి లబ్ధిదారుల నుంచి కన్సెంట్ తీసుకోవాలని తెలిపారు. రైతులను చైతన్యం చేసి జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మించి ఆయిల్‌పామ్ పంట సాగయ్యేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం యూనిట్‌ల గ్రౌండింగ్ పురోగతిపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్, డీపీవో రవీందర్, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ ఉపేందర్‌రావు, ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, ఎంపీడీఓలు, తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

వేములవాడఅర్బన్: పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. వేములవాడలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేసి మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు ఉన్న తక్కువ సమయాన్ని సద్వినియం చేసుకొని, బాగా చదవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పరిసరాలను పరిశీలించారు. ఎంఈవో బన్నాజీ, హెచ్ఎం సుహాసినిఉన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్లలోని మండల వనరుల కేంద్రం, భవిత సెంటర్, ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించారు. పుస్తకాల గోదాంను పరిశీలించి, స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఎంఈవో రఘుపతి, బుక్స్ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, సిబ్బంది భవాని, సలీం, సత్యం ఉన్నారు.

అమరులను స్మరించుకుందాం



ఎల్లారెడ్డిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జాతి ఆశయాలను సాధించే దిశగా పోరాడి అమరులైన వారిని స్మరించుకుందామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదామన్నారు. జాతి కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడడమే అమరులకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంతడుపుల గోపాల్, దేవరాజు, రాజుకుమార్, సతీశ్, గంగయ్య, అశోక్, ప్రవీణ్ ఉన్నారు.

వర్గీకరణ సాధించే వరకూ పోరాడుతాం

సిరిసిల్లఅర్బన్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాడుతామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కో–ఆర్డినేటర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌక్ వద్ద బుధవారం ఏబీసీడీ వర్గీకరణకు ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్, జిల్లా కోఆర్డినేటర్ గుండా థామస్, నాయకులు దేవరాజు, రాజు, మ్యాకల బాబు, అరుణ్, సంజీవ్ ఉన్నారు.

క్లుప్తంగా

కమాన్ ప్రారంభం



ప్రారంభంలో వినోద్‌కుమార్, రవిశంకర్

బోయినపల్లి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి, రామాలయానికి వెళ్లే దారిలో నిర్మించిన నూతన కమాన్‌ను బుధవారం ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్ జోగినిపల్లి రవీందర్‌రావు స్మారకార్థం ఈ కమాన్ నిర్మించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, సర్పంచ్ జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, జోగినిపల్లి అజిత్ రావు, ఆదిత్యరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం.. చింతల్‌ఠాణాకు చెందిన ఆకుల ముత్తయ్య కొన్ని నెలలకింద విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. విద్యుత్ సహకార సంస్థ ఆధ్వర్యంలో మంజూరైన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇక్కడ జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్ రావు, వైస్ ఎంపీపీ ఆర్‌సీ రావు, పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, సర్పంచులు రాంరెడ్డి, రేగులపాటి రాణి, నాయకులు బూర బాబు, భూమల్ల లక్ష్మణ్, సెస్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

సిరిసిల్లటౌన్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సినీనటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కేవీ ప్రదీప్‌కుమార్ కోరారు. పద్మనాయక మండపంలో బుధవారం సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సమయాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి, పరీక్షలకు ఎలా సన్నద్ధ కావాలో వివరించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్, ప్రిన్సిపాల్ బీజే, మార్టిన్ ఉన్నారు.

సిలిండర్ ధర మళ్లీ పెంపు

- వంటగ్యాస్‌పై రూ.50, కమర్షియల్‌పై రూ.350 అదనం
- ఉమ్మడి జిల్లా వినియోగదారులపై రూ.2.50 కోట్ల భారం



కరీంనగర్ అర్బన్: మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా తయారైంది వినియోగదారుల పరిస్థితి. ఓవైపు కరోనాతో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కాగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు గుండెల్లో గుబులు రేపుతున్నాయి. తాజాగా వంటగ్యాస్ ధరలను పెంచడం ఆందోళనకర పరిణామం. రాయితీ గ్యాస్ సిలిండర్లకు రాయితీని కేంద్రం ఖాతాలో జమ చేస్తున్నప్పటికీ నగదు మొత్తం చెల్లించాల్సి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రస్తుత పెంపుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయా వర్గాలపై నెలకు రూ.2.50 కోట్ల భారం పడనుంది.

గత ఆగస్టులో రూ.666.. ఇప్పుడు రూ.1,175

గత మూడేళ్లలో గ్యాస్ సిలిండర్ ధరలను తొమ్మిదిసార్లు పెంచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్యాస్ వినియోగదారులు 5,00,720 మంది ఉన్నారు. సగటున నెలకు 3.50 లక్షల సిలిండర్ల వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. గత ఆగస్టులో సిలిండర్ ధర రూ.666 ఉంది. ఇప్పటివరకు రూ.1,125 చెల్లిస్తుండగా ఇకనుంచి రూ.1,175 చెల్లించాల్సి ఉంటుంది.

'కమర్షియల్'.. ఒకేసారి రూ.350 పెంపు

కమర్షియల్ సిలిండర్ ధర ఈ నెల 28వ తేదీ వరకు రూ.2,015 ఉండగా ఒకేసారి రూ.350 పెంచడంతో రూ.2,365కు చేరింది. ఎన్నికల సమయం కావడంతో ధరలను తగ్గించి, వినియోగదారులను తమవైపు తిప్పుకుంటారని భావిస్తే అలా జరగలేదు. ఫలితంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వివిధ రకాల ఆహార ఉత్పత్తులకు ధరలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో కమర్షియల్ సిలిండర్లు 80 వేలుండగా పెరిగిన ధరతో నెలకు రూ.2.80 కోట్లు భారం పడనుంది.

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు

కరీంనగర్:	1,32,210
జగిత్యాల:	1,28,312
పెద్దపల్లి:	1,31,098
సిరిసిల్ల:	1,09,100

ఆగని వసూళ్లు.. రాయితీపై స్పష్టతేదీ?

ఓవైపు గ్యాస్ ధరలు పెరుగుతుంటే డోర్ డెలివరీ బాయ్స్ వసూళ్లు మాత్రం ఆగడం లేదు. అక్రమ వసూళ్లపై అధికారులకు సమాచారమిచ్చినా చర్యలు శూన్యమని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పట్టణాల్లో సిలిండర్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 నుంచి రూ.70 వరకు వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉమ్మడి జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు 96 ఉన్నారు. 5 కిలోమీటర్లలోపు దూరం ఉంటే వినియోగదారులకు ఉచితంగా సిలిండర్ ఇంటికి చేరవేయాలి. ఆపై దూరం ఉంటే రూ.10 మాత్రమే తీసుకోవాలి. వినియోగదారుడి ఇంటికి గ్యాస్ సిలిండర్‌ను చేర్చడం ఏజెన్సీ నిర్వాహకుడి బాధ్యత. ఒకవేళ వినియోగదారులు ఏజెన్సీకి వెళ్లి, గ్యాస్ తెచ్చుకుంటే రూ.16.47 తక్కువగా తీసుకోవాలి. కానీ ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. అయితే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తొలుత సిలిండర్‌కు రూ.220 చొప్పున రాయితీ ఇచ్చింది. ప్రస్తుతం రూ.47 మాత్రమే జమ చేస్తోంది. ఇప్పుడు ధర పెరిగినా రాయితీపై స్పష్టత ఇవ్వలేదు.

కట్టెల పొయ్యే ఉత్తమం..



గ్యాస్ ధరలను తగ్గించాల్సింది పోయి ఏటికేడు పెంచుతున్నారు. ఒకప్పుడు రూ.514 ఉంటే ఇప్పుడు రూ.1,175కు పెంచారు. ఆ స్థాయిలో ప్రజల ఆదాయం పెరగడం లేదు. ఇలాగైతే మళ్లీ కట్టెల పొయ్యిని ఆశ్రయించడమే ఉత్తమం.

– శిరీష, గృహిణి, కట్టరాంపూర్

వ్యాపారం దెబ్బతింటుంది..



నేను టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న. మా రంగంలో పోటీ ఎక్కువ. గ్యాస్ ధరను ఏకంగా రూ.350 పెంచారు. దీనివల్ల ఇప్పుడున్న రేటుకు టిఫిన్లు చేస్తే గిట్టుబాటు కాదు. టిఫిన్ ధర పెంచితే కస్టమర్లు రాక వ్యాపారం దెబ్బతింటుంది.

– అనిల్, వ్యాపారి

పెద్దూరు ప్యాక్స్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



పెద్దూరు సింగిల్ విండో కార్యాలయం

సిరిసిల్ల అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బర్కం వెంకటలక్ష్మిపై అవిశ్వాస తీర్మాన కాపీని డీసీవోకి అందజేసినట్లు పలువురు సింగిల్‌విండో డైరెక్టర్లు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎన్నికలు 2020లో జరిగాయి. ఈ ఎన్నికల్లో 13 మంది అభ్యర్థులు పోటీలో పాల్గొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొనగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి బర్కం వెంకట లక్ష్మి ఏడుగురు డైరెక్టర్ల మద్దతుతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఫిబ్రవరి 17, 2023 సంవత్సరంతో మూడేళ్లు గడవడంతో 10 మంది డెరెక్టర్లు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. బుధవారం సంబంధిత అధికారులు కార్యాలయంలో విచారణ జరిపినట్లు తెలిసింది. ఇప్పటికే పదిమంది డైరెక్టర్లు కూడా క్యాంపుకు తరలినట్లు సమాచారం. కాగా పెద్దూరు చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీఆర్‌ఎస్ మద్దతుదారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోతుందా? నెగ్గుతుందా అనేది తెలియాల్సి ఉంది.

గూడూరులో ధ్వజస్తంభ పున : ప్రతిష్ఠాపన

ముస్తాబాద్ : మండలంలోని గూడూరులో మల్లిఖార్జునస్వామి ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్ పీఏ చీటి వెంకటేశ్వర్ రావు తన తండ్రి ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం రూ.1.51 లక్షలతో ఏకశిల ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయించారు. రఘురామ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీ కృష్ణ యాదవ సంఘం బాధ్యులు రమేశ్, నాంపెల్లి తెలిపారు. అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ చీటి జితేందర్ రావు రూ.51వేలు అందించారు. కారంగుల రవీందర్ రావు లైటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటనర్సింగ రావు, సురేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో బుధవారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. ఓ గీత కార్మికుడితో పాటు ఐదు గేదెలపై దాడిచేశాయి. మండలకేంద్రానికి చెందిన సందుపట్ల మహేందర్ రెడ్డి, పోరంపేట్ దేవయ్య, మక్కిన చంద్రారెడ్డి, సందుపట్ల రాంరెడ్డికి చెందిన ఐదు గేదెలతో పాటు ఓ గీత కార్మికుడిపై దాడిచేశాయి. కాగా పశు వైద్యాధికారులు చేరుకొని వాటికి చికిత్స అందించారు. కుక్కలబెడద నుంచి రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరుతున్నారు.

కంకరను తక్కువ ధరకే విక్రయించాలి



మాట్లాడుతున్న కాంట్రాక్టర్ శంకరయ్య

సిరిసిల్లఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టోన్ క్రషర్ల సిండికేటును ఎత్తివేసి, తక్కువ ధరకు కంకర విక్రయించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనాల శంకరయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో స్టోన్ క్రషర్ల యాజమానులు కంకరను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఇతర జిల్లాలో తక్కువ ధరకు దొరకడంతో అక్కడి నుంచి కంకరను తీసుకువస్తే అడ్డుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా క్రషర్ యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చేస్తున్న పలు ప్రభుత్వ అభివృద్ధి పనులను నిలిపివేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు వీరారెడ్డి, దర్సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రం, హన్మంత రెడ్డి, నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్థానిక సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆలయం ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కొన్ని దశాబ్ధాల క్రితం పూర్వీకులు నిర్మించిన పురాతన రాతి కట్టడంతో ఉన్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో, పునర్నిర్మాణానికి ఐదేళ్లుగా అన్ని కుల సంఘాలతో చర్చించి, నిర్ణయించి, మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి నిధులు కేటాయించినట్లు తెలి పారు. కార్యక్రమంలో ఏపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

వేములవాడ రూరల్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నాగరాజు అన్నారు. మండలంలోని నూకలమర్రి గ్రామ తండాలో సైబర్ జాగరుకా దివస్‌లో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు చూసి మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని జయవరం గ్రామ ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఆవిష్కరించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి, ఎంపీటీసీ తిరుపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, తూం భాగ్యమ్మ, ఇటిక్యాల నవీన్, సత్తయ్య, కల్పన, నాగరాజు, అశోక్, శ్రీనివాస్, అంజి, కిరణ్, రాజు, బాపు రావు, మల్లేశం, లచ్చయ్య, ప్రసాద్, బాబు, కిష్టస్వామి, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

వేములవాడ: గల్ఫ్ పంపిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన వేములవాడకు చెందిన చెటుకూరి నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. తాను విలేకరిని అని బెదిరింపులకు పాల్పడినట్లు ముగ్గురు వ్యక్తుల ద్వారా ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.

అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

వేములవాడ ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ వెంకటేశ్ హెచ్చరించారు. డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేయడంతోపాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తెలిపారు.

దూరపుచూపు అద్దాలు అందేదెప్పుడో?

- 42 రోజుల్లో 2,127 మందికి పరీక్షలు
- 16 మందికి మాత్రమే పంపిణీ
- రీడింగ్ అద్దాల పంపిణీతో సరిపెడుతున్న అధికారులు



పరీక్షలు చేస్తున్న కంటి వైద్యుడు



"ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి చందుర్తికి చెందిన పోంచెట్టి నర్సయ్య. నెల రోజుల క్రితం కంటివెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకున్నాడు. దూరపుచూపు మందంగించిందని వైద్యులు తెలిపారు. ఈ అద్దాలను ఆర్డర్లపై తెప్పించి 10 రోజుల్లో అందజేస్తామని చెప్పారు. పరీక్షలు చేసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు దూరపు చూపు అద్దాలు అందలేదు. మసక చూపుతోనే కాలం వెళ్లదీస్తున్నాడు."

చందుర్తి(వేములవాడ):రెండోవిడత కంటివెలుగు శిబిరాల్లో దూరపు చూపు సమస్య ఉన్న వారికి కంటి అద్దాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. వైద్యులు పరీక్షించి దూరపుచూపు లేక ఇబ్బంది పడుతున్న వారికి ప్రత్యేక అద్దాలను వైద్యులు సిఫారసు చేస్తున్నారు. ఈ అద్దాలను పది రోజుల్లో అందజేస్తామని చెబుతున్నప్పటికీ నెల రోజులు గడుస్తున్నా రావడం లేదు. ఇప్పటికే చందుర్తి మండలంలోని రామన్నపేట, చందుర్తి గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు పూర్తికాగా.. మర్రిగడ్డలో కొనసాగుతోంది.

694 మందిలో 16 మందికే పంపిణీ

చందుర్తి, రామన్నపేటల్లో 416 మందికి ప్రత్యేక అద్దాలు అవసరం కాగా.. 16 మందికి అందజేశారు. మిగతా 400 మంది అద్దాల కోసం ఎదురు చూస్తున్నారు. మర్రిగడ్డలో ప్రత్యేక అద్దాలు అవసరం ఉన్న 178 మందిని గుర్తించారు. మూడు గ్రామాల్లో కలిపి దూరపుచూపు అద్దాలు ఇప్పటికే 694 మందికి గుర్తించగా 16 మందికి అందజేశారు.

శస్త్రచికిత్సలు మరిచిన ప్రభుత్వం

రాష్ట్రంలో తొలిసారి కంటివెలుగు కార్యక్రమాన్ని 2018 ఆగస్టు నుంచి 2019 ఫిబ్రవరి వరకు పరీక్షలు చేశారు. రీడింగ్ గ్లాసులు (దగ్గరి చూపు) అద్దాలను కొందరికి పంపిణీ చేశారు. మిగతా వారికి చేతులెత్తేశారు. మండలంలో 324 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినప్పటికీ వారికి ఇప్పటి వరకు చేయించలేదు.

రెండోవిడతలో ప్రత్యేక అద్దాలు అందేనా?

రెండోవిడత కంటివెలుగు జనవరి 19న ప్రారంభమైంది. ఈసారి బాధితులకు అన్ని రకాలుగా వైద్యసేవలు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. మండలంలో ఇప్పటికే మూడు గ్రామాల్లో కలిపి 2,127 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో రీడింగ్ అద్దాలు అవసరమున్న 221 మందికి వెంటనే పంపిణీ చేశారు. అసలు సమస్య ఏంటంటే దూరపుచూపు ఇబ్బంది ఉన్న వారికి రావడం లేదు.

మూడేళ్ల కిందవే రాలేదు



మూడేళ్ల కింద కంటిపరీక్షలు చేసిన డాక్టర్లు అద్దాలు అవసరమని చెప్పిండ్రి. 15 రోజుల్లోనే తెప్పించి ఇస్తామన్నారు. మూడేళ్లుగా అద్దాలు వస్తనే లేవు. వస్తాయనే ఆశలు కూడా వదులుకున్న.

– బంగ్లా అంతవ్వ, బండపల్లి

ఆర్డర్ చేసి తెప్పించడమే..



చందుర్తి మండలంలోని ఇప్పటి వరకు రెండు గ్రామాల్లో పూర్తయి, మూడో గ్రామంలో పరీక్షలు చేస్తున్నాం. దగ్గరిచూపు లేక ఇబ్బంది పడుతున్న వారికే వెంటనే రీడింగ్ గ్లాసులు అందజేస్తున్నాం. దూరపు చూపు లేక ఇబ్బంది పడుతున్న వారికి అద్దాలను ఆర్డర్ చేసి తెప్పిస్తున్నాం. ఎక్కువ మొత్తంలో ఆర్డర్లు ఉండడంతో జాప్యమవుతుంది. వారం, పది రోజుల్లో వస్తాయి.

– కె.ప్రభాకర్, కంటి వైద్యుడు

బ్రిడ్జి పనుల పరిశీలన



నాసిరకం ఇసుకను చూపుతున్న నాయకులు

వీర్నపల్లి (సిరిసిల్ల) : వీర్నపల్లి మండలకేంద్రంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను సీపీఐ జిల్లా రైతు సంఘం కార్యదర్శి జంగం అంజయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు బ్రిడ్జి నిర్మాణపనుల కోసం వాగుపక్కనే ఉన్న ఇసుకను వాడడం వల్ల బ్రిడ్జి నాణ్యత కోల్పోతుందన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్ గోపాల్‌ను అడిగితే పనులకు ఏఈ, డీఈలు పరిశీలించి పనులు కొనసాగించాలని చెప్పారన్నారు. కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై పనులు చేస్తున్నారని, కాంట్రాక్టర్ లైసెన్సు రద్దుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ జిల్లా నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, మోహన్, ప్రభాకర్, నర్సన్న ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ నాయకులు

తంగళ్లపల్లి: మండలం కేంద్రంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కుడిక్యాల కనకయ్య, కార్యదర్శిగా గోరంతల రాజమల్లు, ఉపాధ్యక్షులుగా కోడం వేణు, మూషం శంకర్, సహాయ కార్యదర్శులుగా మామిడాల శేఖర్, గుర్రం బాబు, గౌరవాధ్యక్షుడిగా అన్నల్‌దాస్ గంగాధర్, కమిటీ సభ్యులుగా గడ్డం ఎల్లయ్య, ద్యావనపెల్లి రమేశ్, బోగ నర్సయ్య, దాసరి రాజు, కందికట్ల సత్యనారాయణ, చేరాల రాజు, ముదిగొండ సత్యనారాయణ, గడుదాస్ రమేశ్, గౌడ శ్రీనివాస్, అరగొండ రామచంద్రం, గాజుల రవి, సబ్బని మహేందర్, ఆడెపు కృష్ణహరి, సామల లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, గడ్డం రాజశేఖర్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం శ్రమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర బాబు

వేములవాడ అర్బన్: విద్యార్థులు లక్ష్యసాధన కోసం శ్రమించాలని సిరిసిల్ల పిల్లల వైద్య నిపుణుడు సురేంద్ర బాబు అన్నారు. మండలంలోని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. పరీక్షల్లో ఒత్తిడిని జయించేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.